# మాండూక్యోపనిషత్తు

– డా. దువ్వూరి ఫణియజ్ఞేశ్వరయాజులు

**ఉపోద్ఘాతము:**

ఉపనిషత్ పదమునకు చెప్పబోవు రీతిన బ్రహ్మవిద్య అని అర్థము. పరమాత్మనుగూర్చి చెప్పుట దుర్లభమని ఉపనిషత్తులు కంఠోక్తిగా బోధించుచున్నవి. **ఆశ్చర్యోస్య వక్తా కుశలః** అను కఠోపనిషత్తు వాక్యప్రకారం పరమేశ్వరుని గూర్చి చెప్పుటకు కుశలుడగు వక్త దుర్లభుడు. ఈ విధముగా వక్తృదౌర్లభ్యమును శ్రుతులు చెప్పుటచే బ్రహ్మవిద్య చాలా దురవగాహమని స్పష్టమగుచున్నది. కానీ కఠోపనిషత్తులో ఆనందగిరులవారు ఈ విధముగా పేర్కొనిరి. **పరమేశ్వరాచార్యానుగ్రహేణ తు లభ్యత ఇత్యాహ** అనగా పరమేశ్వరునియొక్క, సద్గురువుయొక్క అనుగ్రహముచే మాత్రం పరమాత్మ లభ్యుడని బోధించుటచే తదుభయానుగ్రహ ప్రాప్తికి వందనరూపమైన మంగళాచరణము ఉపనిషత్ ప్రారంభమున కనబడుచున్నది.

ఉపనిషత్ అను పదమునకు బ్రహ్మవిద్య అనునది ముఖ్యార్థము. షద్ విశరణగత్యవసాదనేషు అను వ్యాకరణశాస్త్రానుసరణముచే ఈ ధాతువునకు మూడు అర్థములు అవి 1. విశరణము – అనగా విశ్లేష, లేక శైథిల్యము 2. గతి – అనగా ప్రాప్తి. 3. అవసాదనము అనగా నాశము. వీటిలో మొదటి ధాత్వర్థమును అనుసరించి బ్రహ్మజ్ఞానము గర్భవాస, జన్మ, జరా, రోగాది అనర్థసంఘమును శైథిల్యమును పొందిచునది. (నిశాతయతి) కావున ఉపనిషత్ అని అర్థము. రెండవ ధాత్వర్థమును అనుసరించి ముముక్షువులకు బ్రహ్మప్రాప్తిని కలుగజేయునది, మూడవ ధాత్వర్థమునునుసరించి సంసారబీజమగు అవిద్యాదికమును నశింపచేయునది ఈ బ్రహ్మవిద్య కావున ఈ మూడు ధాత్వర్థములచేతను ఉపనిషత్ పదమునకు బ్రహ్మజ్ఞానము అర్థము. మరియు **ఉప – సమీపే నిషణ్ణం అస్యాం పరం శ్రేయః**

**ఇత్యుపనిషత్** అనగా ఉత్కృష్టమగు శ్రేయస్సునకు సాధనముగాన ఉపనిషత్ అని శ్రీమచ్ఛంకరభగవత్పాదులు, సురేశ్వరాచార్యులు, శ్రీవిద్యారణ్యయతీంద్రులు మున్నగు పూజ్య యతిసార్వభౌములు ఈ ఉపనిషత్ పదమునకు బ్రహ్మజ్ఞానమును ముఖ్యార్థముగా తెలిపిరి. అదేవిధముగా బ్రహ్మజ్ఞానప్రతిపాదకమగు గ్రంథమునకు ఉపనిషత్ అనువ్యవహారము గౌణము అనగా లాక్షణికము. లోకములో లాంగలం జీవనం అను లౌకక ప్రయోగములో ఆశబ్దమువలన నాగలి జీవనము అను అర్థం సిద్ధించుచున్నది కాని నాగలి యెన్నటికీ జీవనము కానేరదు. కావున లక్షణావృత్తిచే జీవనవాచకమగు జీవనశబ్దమునకు జీవనసాధనమగు అర్థమును యెట్లుచెప్పుచుందురో, అదేవిధముగా **ఆయుర్వై ఘృతం** అను మంత్రమున ఘృతము ఆయుర్హేతువను అర్థమును యెట్లు చెప్పుచుందురో అట్లే ప్రకృతములో ముఖ్యవృత్తిచే బ్రహ్మజ్ఞానమును చెప్పెడి ఉపనిషత్ పదముచే లక్షణావృత్యా బ్రహ్మవిద్యాప్రతిపాదకమగు వేదభాగము చెప్పబడుచున్నది.

ఈవిధముగా ఉపనిషత్ శబ్దమును నిర్వచించి ఉపనిషత్ ప్రతిపాద్యమగు ఆత్మజ్ఞానము మానవునకు అన్నిటికంటే సర్వోత్తమమైనది కావున అట్టి ఆత్మను తెలుసుకొనుటకు ఉపాయమెట్లు అను విచికిత్సపై ఉపనిషత్తులు అట్టి ఉపాయమును ప్రధానముగా బోధించుచున్నవి.

ఇట్టి దుర్విజ్ఞేయమైన ఆత్మజ్ఞానముకొరకు ఉపనిషద్విచారము చేయవలెనని ఫలితార్థము. ఈ విచారమునకు సాధనములుగా బహిరంగ అంతరంగ భేధముచే రెండువిధములు చెప్పబడినవి. సంచిత మహాపాపములుగల పురుషులకు జ్ఞానమార్గము రుచించదు అంతే గాక స్వతః ద్వేషము జనించును, ఇట్టివారికి బహిరంగసాధనములైన యజ్ఞాదులు వివిధిషను పుట్టించునని **తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసా అనాశకేన** మొదలగు శ్రుతులు చెప్పుచున్నవి. ఈ రీతిగా నిష్కామకర్మానిష్ఠానముచే ఆత్మవిద్యయందు రుచి పుట్టినపిదప అంతరంగ

సాధనములగు నిత్యానిత్యవస్తువివేకము, విషయవైరాగ్యము, శమాదిసాధనసంపత్తి, ముముక్షుత్వము అను వాటిని సాధనచేయవలెను.

## ప్రకృతమున మాండూక్యోపనిషత్తును గూర్చి సంక్షేపవివరణము

మండూకమహర్షి ప్రోక్తమైనందున దీనిని మాండూక్యోపనిషత్ అని అందురు, ఇది అథర్వవేదమునకు సంబంధించినది. అన్నిటికన్నా పరిమాణములో చిన్నదైన ఈ ఉపనిషత్తులో 12 మంత్రములు మాత్రమే ఉన్నవి. ఐనప్పటికీ మొత్తం ఉపనిషత్తుల సారం ఇందులో నిక్షిప్తమై ఉన్నది. శంకరభగవత్పాదులు దీనికి విస్తృతభాష్యం రచించి, తమ అద్వైతసిద్ధాంతమునకు ఆధారముగా చేసుకున్నారు. నాలుగుమహావాక్యములలో ఒకటైన **అయమాత్మా బ్రహ్మ** అనునది ఈ ఉనిషత్తునందే ఉన్నది.

అద్వైతసిద్ధాంతమునకు అతిప్రముఖులైన వారిలో గౌడపాదాచార్యులు ఒకరు. వీరు శ్రీ శుకమహర్షి శిష్యులని ప్రసిద్ధి. వీరిశిష్యులు గోవిందపాదులు, వారిశిష్యులు శ్రీ శంకరులు, ఈపరంపరలోనే శంకరభగవత్పాదులు అద్వైతమును అందిపుచ్చుకున్నారని చెప్పవచ్చు, గౌడపాదులు అనేక రచనలు చేసినప్పటికి మాండూక్యోపనిషత్ యందలి కారికలు అద్వైతసిద్ధాంమునకు పునాదులు అనడం నిర్వివాదాంశము. గౌడపాదులవారి మాండూక్య కారికలు నాలుగుభాగములుగా విభజింపబడినవి, అవి

### 1. ఆగమప్రకరణమ్

దీనిలో మాండూక్యోపనిషత్తుకు అర్థవివరణచేసి, తాను ప్రతిపాదించిన పరమార్థతత్వము వేదవిహితమని, హేతుబద్ధమని నిరూపించారు దీనియందే ఓంకారతత్త్వమును కూడా విశదీకరించిరి.

## 2. వైతథ్యప్రకరణమ్

వితథ అనగా వాస్తవస్వరూపం కంటే భిన్నముగా ఉన్నది, వైతథ్యము అనగా అనిత్యమైనది అని అర్థము. దీనిద్వారా ప్రపంచ మిథ్యాత్వాన్ని ప్రతిపాదించిరి.

## 3. అద్వైతప్రకరణమ్

దీనియందు అద్వైతసిద్ధాంతము వివరింపబడినది. శంకరులు ఈ అద్వైతసిద్ధాంతమును గౌడపాదశిష్యులు గోవిందపాదులవద్ద అధ్యయనముచేసి ఆమార్గమునే అనుసరించిరి.

## 4. అలాత, శాంత, ప్రకరణమ్

వేదప్రామాణ్యమును అంగీకరించని బౌద్ధము మొదలగు సిద్ధాంతములు ఇందు ఖండింపబడినవి. అద్వైతసిద్ధాంతములోని ప్రధాన అంశములైన జీవబ్రహ్మైక్యమును, మాయావాదము ప్రతిపాదించి, ప్రాతిభాసిక, వ్యావహారిక, పారమార్థిక భేదములతో సత్యవిభజన చేసిరి, తుదిపురుషార్థమైన మోక్షమునకు జ్ఞానమొక్కటే మార్గమని వివరించిరి, అసత్కార్యవాదమును, సత్కార్యవాదమును, విజ్ఞానవాదమును, ఖండించిరి. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు దాటిన తరువాత తురియములో ఆత్మానుభవము కలుగునని గౌడపాదులవారి సిద్ధాంతము. ఇందలి మంత్రములకు సంక్షేపముగా అర్థవివరణము

1. ఈసమస్తలోకమూ ఓంకారమే, గతించినవి, ఉన్నవి, రాబోవునవి, అన్నియు ఓంకారమే, మూడు కాలములకు అతీతమైనది ఏది ఉన్నదో అది కూడా ఓంకారమే.
2. విశ్వంలో ఉన్నవి అన్నీ భగవత్స్వరూపములే, ఈ ఆత్మకూడా భగవంతుడే, ఇట్టి ఆత్మ నాలుగు పరిణామములు కలిగినది.

3. ఆత్మయందు మొదటిపరిణామము వైశ్వానరుడు అనబడుచున్నాడు. ఈ వైశ్వానరుడి చైతన్యం బాహ్యాముఖంగా ఉన్నది. 7 అవయవములు, 19 ముఖములు, కల ఈ వైశ్వానరుడు జాగ్రదావస్థలో బాహ్యాజగత్తును అనుభవిస్తున్నాడు.

4. ఆత్మలో రెండవపరిణామము తైజసుడు అనబడుచున్నాడు. దీని చైతన్యము అంతర్ముఖమైనది. 7 అవయవములు, 19 ముఖములు, కలిగిన ఈ తైజసుడు స్వప్నావస్థలో మానసికలోకాన్ని అనుభవిస్తాడు.

5. కోరికలు కలలో ఏదీలేని నిద్రాస్థితి ఆత్మలో మూడవపరిణామమగును. ఈ స్థితిని అనుభవించేవాడు ప్రాజ్ఞుడు అనబడును. ఈస్థితిలో ఎట్టి అనుభవములు ఉండవు. గ్రహణశక్తి బహిర్గతమై ఒక రాశిగా ఉంటుంది. అందుచేత ఇది జాగ్రత్ స్వప్నస్థితిచేతనలకు ద్వారముగా ఉంటుంది. ఆనందస్వరూపుడైన ప్రాజ్ఞుడు ఇచట ఆనందమును అనుభవించును.

6. ఇతడే సర్వేశ్వరుడు, సర్వమూ తెలిసినవాడు. ఇతడే అన్నిప్రాణులయందు అంతర్యామిగా ఉండి ప్రవర్తింపచేస్తున్నాడు. సమస్తానికి మూలకారకుడు. ప్రాణుల ఉత్పత్తికి వినాశమునకు ఇతడే కారకుడు.

7. నాలుగవ పరిణామం అంతర్ముఖ బహిర్ముఖ స్థితులు కాదు. అది చేతనస్థితికాదు, కనిపించునది కాదు, గ్రహింపశక్యముకానిది ఊహాతీతమైన వర్ణనాతీతమైన స్థితికాదు. దానిని ఆత్మచైతన్యముగా మాత్రమే తెలుసుకోగలము. అచట ప్రాపంచిక చైతన్యము లేదు అది ప్రశాంతమైనది. మంగళకరమైనది అద్వైతమ్. ఇది యే నాలుగవపరిణామం. ఇది యే ఆత్మ. ఇది యే తెలుసుకొనదగినది.

8. ఈ ఆత్మను శబ్దపరముగా చెప్పవలెనన్నిన అదియే ఓంకారము. అకార ఉకార మకారములనే మూడు మాత్రలతో ఓంకారము రూపొందినది.

9. ఓం కారమందు మొదటిభాగమైన అకారము జాగ్రదావస్థపరిణామమైన వైశ్వానరునితో పోల్చబడుతుంది. వ్యాపకత్వం వల్ల ఆరంభత్వం వల్ల ఈ రెండు సమముగా ఉన్నవి. ఈ విధముగా ఉపాసనచేసేవారి అన్ని కోరికలూ నెరవేరును. అట్టి ఉపాసకుడు సర్వసంపదలతో తోటివారిలో అగ్రగణ్యుడగును.

10. ప్రణవములో రెండవభాగమైన ఉకారము స్వప్నావస్థను ఆధారముగాచేసుకున్న తైజసుడు. శ్రేష్ఠత్త్వం వల్ల, రెండిటిసంబంధంవల్ల రెండూ సమానముగా ఉన్నవి. ఈవిధముగా తెలుసుకున్న వారు నిశ్చయంగా జ్ఞానసంతతిని పెంపొందించుకుంటారు. సుఖ దుఃఖములవంటి ద్వంద్వములలో సమతుల్యంతో వ్యవహరిస్తారు. జ్ఞానికానివారెవరూ అతడివంశంలో జన్మించరు.

11. మంత్రములో మూడవభాగమైన మకారము సుషుప్తిని ఆధారముగా చేసుకున్న ప్రాజ్ఞుడు. మానస్వభావము వలన గ్రహించే స్వభావం చేత రెండూ సమముగా ఉన్నది. ఈవిధంగా తెలుసుకున్నవారు సమస్తమును మానముచేసేవారిగా గ్రహించేవారిగా అవుతారు.

12. ఓంకార మంత్రములో నాల్గవభాగము, నిర్వికారమైనది మంగళకరమైనది. ఈ ప్రకారం తెలుసుకున్నవారు ఆత్మద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందుదురు.

పరిమాణంలో స్వల్పమైన కేవలం 12 మంత్రములతో మాత్రమే కూడిన ఈ ఉపనిషత్తు సర్వవేదాంతతత్త్వమును విస్తృతముగా తెలియజేయుచున్నది. గౌడపాదాచార్యులు మాండూక్యకారికలుగా ప్రసిద్ధిచెందిన 215 కారికలను రచించి వాటికి విస్తృతమైన వ్యాఖ్యానము అందించినారు.

స్వస్తి

# మాండూక్యోపనిషత్

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।
స్థిరైరంగైస్తుష్టువాంసస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః ।
స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తి నః పూషా విశ్వవేదాః ।
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**అథ మాండూక్యోపనిషత్ ప్రారంభః**

**హరిః ఓమ్**

ఓం ఇత్యేతదక్షరమిదం సర్వం తస్యోపవ్యాఖ్యానం
భూతం భవద్ భవిష్యదితి సర్వమోంకార ఏవ।
యచ్చాన్యత్ త్రికాలాతీతం తదప్యోంకార ఏవ ॥ ॥ 1 ॥

సర్వం హ్యేతద్ బ్రహ్మాయమాత్మా
బ్రహ్మ సోఽయమాత్మా చతుష్పాత్ ॥ ॥ 2 ॥

జాగరితస్థానో బహిఃప్రజ్ఞః సప్తాంగ ఏకోనవింశతిముఖః
స్థూలభుగ్వైశ్వానరః ప్రథమః పాదః ॥ ॥ 3 ॥

స్వప్నస్థానోఽన్తఃప్రజ్ఞః సప్తాంగ ఏకోనవింశతిముఖః
ప్రవివిక్తభుక్తైజసో ద్వితీయః పాదః ॥ ॥ 4 ॥

యత్ర సుప్తో న కంచన కామం కామయతే న
కంచన స్వప్నం పశ్యతి తత్ సుషుప్తం । సుషుప్తస్థాన
ఏకీభూతః ప్రజ్ఞానఘన ఏవానందమయో హ్యానందభుక్
చేతోముఖః ప్రాజ్ఞస్తృతీయః పాదః ॥ ॥ 5 ॥

ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోఽన్తర్యామ్యేష యోనిః సర్వస్య
ప్రభవాప్యయౌ హి భూతానాం ॥ ॥ 6 ॥

నాంతఃప్రజ్ఞం న బహిఃప్రజ్ఞం నోభయతఃప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం
న ప్రజ్ఞం నాప్రజ్ఞం । అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణం
అచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం
శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః ॥ ॥ 7 ॥

సోఽయమాత్మాధ్యక్షరమోంకారోఽధిమాత్రం పాదా
మాత్రా మాత్రాశ్చ పాదా అకార ఉకారో మకార ఇతి ॥ ॥ 8 ॥

జాగరితస్థానో వైశ్వానరోఽకారః ప్రథమా
మాత్రాఽఽప్తేరాదిమత్త్వాద్వాఽఽప్నోతి
హ వై సర్వాన్ కామానాదిశ్చ భవతి య ఏవం వేద ॥ ॥ 9 ॥

స్వప్నస్థానస్తైజస ఉకారో ద్వితీయా మాత్రోత్కర్షాత్
ఉభయత్వాద్వోత్కర్షతి హ వై జ్ఞానసంతతిం సమానశ్చ భవతి
నాస్యాబ్రహ్మవిత్కులే భవతి య ఏవం వేద ॥ ॥ 10 ॥

సుషుప్తస్థానః ప్రాజ్ఞో మకారస్తృతీయా మాత్రా మితేరపీతేర్వా
మినోతి హ వా ఇదం సర్వమపీతిశ్చ భవతి య ఏవం వేద ॥ ॥ 11 ॥

అమాత్రశ్చతుర్థోఽవ్యవహార్యః ప్రపంచోపశమః శివోఽద్వైత
ఏవమోంకార ఆత్మైవ సంవిశత్యాత్మనాఽఽత్మానం
య ఏవం వేద య ఏవం వేద ॥ ॥ 12 ॥

**ఇత్యుపనిషత్**

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।
స్థిరైరంగైస్తుష్టువాంసస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః ।
స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తి నః పూషా విశ్వవేదాః ।
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇతి మాండూక్యోపనిషత్ సమాప్తః**